

• కమ్మర్‌పల్లి వద్ద ప్రస్తుతం ఉన్న రోడ్డు



» పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు నాలుగులైన్ల రోడ్డు
» కేంద్రం అనుమతి ఇవ్వడంతో ఎన్‌హెచ్ 63 కింద నిర్మాణం
» 132 కి.మీ. మేరకు నిర్మాణం కానున్న కొత్త రోడ్డు
» భూసేకరణ కోసం అధికారుల సమావేశాలు
» మొదలైన అధికారుల సర్వేలు

జిల్లాకు మరో జాతీయ రహదారి!

నిజామాబాద్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు మరో జాతీయ రహదారి మంజూరైంది. పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు ఈ జాతీయ రహదారి నిర్మాణం కానుంది. కేంద్రప్రభుత్వం జాతీయ రహదారికి అనుమతి ఇవ్వడంతో అధికారులు సర్వేలు కొనసాగిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్లు పూర్తిస్థాయి డిపిఆర్‌ను తయారు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు రిపోర్టును కేంద్రానికి అందిన తర్వాత పరిశీలించి అనుమతులను ఇవ్వనున్నారు. కేంద్ర జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో టెండర్లను నిర్వహించి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ రోడ్డు నిర్మాణం కోసం జిల్లాలో భూ సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. జాతీయ రహదారి వెళ్లే గ్రామాల పరిధిలోని రైతులు, ప్రజలతో సమావేశం అవుతున్నారు. జాతీయ రహదారి కోసం ఎంతభూమి పోతుందో వారికి వివరించడంతోపాటు ప్రభుత్వం తరపున వారికి నష్టపరిహారాన్ని అందిస్తామని వివరిస్తూ భూసేకరణ పూర్తిచేసేందుకు అధికారులు చర్యలను చేపట్టారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే నాలుగు లైన్‌ల ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

రోడ్డు పనులకు కేంద్రం అనుమతులు

జిల్లాలో 44వ జాతీయ రహదారి ఉంది. కొత్తగా మెదక్, బాన్సువాడ, బోధన్, భైంసా రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. వీటితో పాటు మరో కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం అనుమతులిచ్చింది. పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు నాలుగులైన్ల నేషనల్‌హైవే రోడ్డు నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఎన్‌హెచ్-63 పేరుపై ఈరోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలోని పెర్కిట్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు ఈ రోడ్డునిర్మాణాన్ని చేపడుతారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం ఈరోడ్డు నిర్మాణం కోసం అనుమతులిచ్చింది. పెర్కిట్ నుంచి మంచిర్యాల మీదుగా మహారాష్ట్రలోని సిరువంచనుంచి ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్ వరకు ఈరోడ్డు వెళ్లేలా నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటికే మంచిర్యాల నుంచి సిరువంచ వరకు రోడ్డు నిర్మాణం పూర్తయినందున మిగతా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర హైవే అథారిటీ సంస్థ ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. పెర్కిట్ నుంచి వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల, ధర్మపురి, వెలగటూరు, లక్సెట్టిపేట్ మండలాల మీదుగా మంచిర్యాల వరకు ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు రెండు రోడ్ల రహదారిగా ఉండగా, నాలుగు రోడ్లుగా నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

132 కి.మీ. వరకు రహదారి నిర్మాణం

పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు 132 కిలోమీటర్ల వరకు ఈ జాతీయ రహదారి నిర్మాణం కానుంది. జిల్లాతోపాటు జగిత్యాల, మంచిర్యాల జిల్లాలో ఈ రోడ్డువెంట ప్రధాన పట్టణాల్లో బైపాస్ రోడ్డు నిర్మాణాలను చేపట్టనున్నారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కాకుండా బైపాస్ మీదకు రోడ్డును మళ్లించి నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే సర్వేలను పూర్తిచేశారు. ఈ మూడు జిల్లాల పరిధిలో నాలుగురోడ్ల నిర్మాణం కోసం ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టును తయారు చేస్తున్నారు. జాతీయ రహదారి 63 కింద చేపట్టే ఈ నాలుగులైన్ల రోడ్డు కోసం భూసేకరణతో పాటు మొత్తం నిర్మాణానికి అయ్యేఖర్చును ప్రాజెక్టు రిపోర్టులో పొందుపరుస్తున్నారు. త్వరలోనే మొత్తం డీపీఆర్‌ను ఎన్‌హెచ్‌ఏఐకి అందిస్తారు. ఈ డీపీఆర్‌ను కేంద్రం ఆమోదం తెలుపగా రోడ్డునిర్మాణం కోసం టెండర్లను పిలిచి పనులను చేపడుతారు. నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామాలు వచ్చినచోట బైపాస్‌లు లేదా హైవేబ్రిడ్జిలను నిర్మాణం చేయనున్నారు.

పశువులు, ఇతర వాహనాలు రాకుండా సర్వీస్ రోడ్డు

జాతీయ రహదారి వెంటవెళ్లే వాహనాలకు ఇబ్బందులు లేకుండా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామాల పరిధిలోని పశువులు గానీ ఇతర వాహనాలు రాకుండా సర్వీస్ రోడ్ల నిర్మాణం కూడా చేపడుతారు. నేషనల్ హైవే 44 నుంచి 63 ద్వారా ఛత్తీస్‌ఘడ్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. భారీ వాహనాలకు చుట్టూ తిరిగి వెళ్లడంతో ఎక్కువదూరం ఉండటం సమయం ఎక్కువగా పడుతుండటంతో ఈరోడ్డు నిర్మాణం చేస్తే దూరం తగ్గడంతోపాటు సరుకుల రవాణా కూడా త్వరగా అయ్యే అవకాశం ఉండటంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు హైవే అథారిటీ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న భూసేకరణ

ఈ జాతీయ రహదారి నిర్మాణం కోసం జిల్లాలో కూడా అధికారులు భూసేకరణ చేపడుతున్నారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల సర్వేకు అనుగుణంగా భూసేకరణ చేపట్టేందుకు ఆయా గ్రామాల ప్రజలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల పరిధిలో ఆర్మూర్ ఆర్‌డిఓ రాజాగౌడ్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఎంత మొత్తంలో భూములు పోతాయో వారికి వివరించారు. జాతీయరహదారి కోసం కొన్ని గ్రామాల పరిధిలో ఇళ్లు, బావులు, ఇతర నిర్మాణాలు తొలగించాల్సి ఉండటంతో వాటి వివరాలను కూడా అందించారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లో బైపాస్ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించారు. ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు ప్రభుత్వం ద్వారా పరిహారాన్ని కూడా అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఈ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం సుమారు 200 ఎకరాల వరకు భూములు పోయే అవకాశం ఉన్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది.

హైవే నిర్మాణానికి అధికారుల కసరత్తు

ఈ జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నిర్ణయించడంతో పూర్తిస్థాయిలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు సర్వే పూర్తి చేసిన అధికారులు ఎంతవరకు ఖర్చు అవుతుందో రిపోర్టులో పొందుపర్చుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే కేంద్రం అనుమతి ఇవ్వడంతో ప్రాజెక్టు రిపోర్టును పంపించిన తర్వాత పూర్తిస్థాయి అనుమతులు వస్తాయని ఆ సంస్థ అధికారులు తెలిపారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే ఈరోడ్డు నిర్మాణం కోసం టెండర్లను పిలిచి ఖరారు చేస్తామన్నారు. టెండర్లు పూర్తైన తర్వాత పనులను చేపడుతామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. మొత్తంగా మరో ఆరునెలల్లోపు ఈరోడ్డు నిర్మాణం పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

లోతుగా దర్యాప్తు!

• ఆస్తులపై మరింత సమాచారాన్ని సేకరిస్తున్న ఏసీబీ అధికారులు • సహకరిస్తున్నవారు, బినామీలపై ఆరా

• ఏసీబీ దాడులతో మున్సిపల్ కార్పొరేషన్‌లో మార్పు జరిగేనా?

నిజామాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టి ఏసీబీ అధికారులకు పట్టుబడిన నిజామాబాద్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ నరేందర్ కేసులో దర్యాప్తు మరింత లోతుగా చేపడుతున్నారు. భారీఎత్తున డబ్బు, ఆస్తులకు సంబంధించిన దస్త్రాలు దొరకడంతో ఇతరవర్గాల సమాచారం ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వివిధ వర్గాల ద్వారా సమాచారాన్ని తీసుకుంటూ ఆయనకు సంబంధించిన ఆస్తుల వివరాలను ఏసీ బీ అధికారులు సేకరిస్తున్నారు. ఏయే ఆస్తులు ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఎంతవిలువ ఉంది.. ఆయనతోపాటు బినామీలు ఎవరైనా ఉన్నారా, ఆయనకు కార్పొరేషన్‌లో ఎవరెవరు సహకరించారో, ఏ వర్గాలకు అనుకూలంగా ఉన్నారో ఆరా తీస్తున్నారు. కార్పొరేషన్‌లో ఆయనకు ఎవరెవరు సహకరించారు.. బదిలీ అయినా ఆయనను ఎందుకు రిలీవ్ చేయలేదు.. బదిలీ ఎవరు నిలిపివేశారు.. అనే అంశాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. పూర్తివివరాలను సేకరించి దర్యాప్తులో నమోదు చేస్తున్నారు.



• ఏసీబీ అధికారుల తనిఖీల్లో నగదుతో పట్టుబడ్డ నరేందర్ (ఫైల్)

• బినామీలపై ఆరా..

నిజామాబాద్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ డి.నరేందర్ ఇంట్లో భారీ ఎత్తున నగదు, బంగారం, ఆస్తులు పట్టుబడటంతో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ నరేందర్‌ను శుక్రవారం అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు ఆయనను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి ఆదేశాల మేరకు జైలుకు తరలించారు. ఈ కేసులో భారీఎత్తున నగదుతోపాటు ఆస్తులకు సంబంధించిన దస్త్రాలు బయటపడటంతో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేయడం ప్రభుత్వాలు మారిన బదిలీ అయిన చోటుకు వెళ్లకపోవడం రెవెన్యూ వివాదంలోనే ఎక్కువకాలం పనిచేయడంతో పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఉద్యోగ నిర్వహణలో ఏయే విభాగాల్లో పనిచేశారో ఆరాతీస్తూనే ఆయా సంబంధాలను ఆర్థిక లావాదేవీలపైన ఏసీబీ అధికారులు దృష్టిసారించారు. పూర్తిస్థాయిలో వివిధవర్గాల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆయన పనిచేసిన కాలంలో ఎవరెవరు, ఏ పార్టీకి చెందిన వారు సహకరించారు. ఏయే పనులు చేయడంతో ఎక్కువ మొత్తంలో ముడుపులు తీసుకున్నారో ఆరా తీస్తున్నారు. గతంలో ఏసీబీ దాడులు జరిగిన సమయంలో బయటపడ్డ వివరాల ఆధారంగా దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్‌లో మరోదఫా పరిశీలించడంతోపాటు పూర్తి వివరాలను సేకరించి బినామీల వివరాలను కూడా రాబడుతున్నట్లు తెలుస్తోంది.

• కార్పొరేషన్‌లో మార్పు జరిగేనా?

మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ అధికారి ఏసీబీకి పట్టుబడటంతో ఉద్యోగుల్లో గుబులు పట్టుకుంది. పనులన్నీ పైసలు లేనిదే జరగకపోవడం ఎక్కువ మంది దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేయడం వల్ల ఇప్పటికైనా మార్పు జరుగుతుందా అని ఎక్కువ మంది ఎదురుచూస్తున్నారు. పన్నుల విభాగంతోపాటు టౌన్‌ప్లానింగ్, సానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల్లో కొంతమంది అధికారులు దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారు. ఉద్యోగులు కూడా కదలడం లేదు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో పలు ఆరోపణలు ఉన్నా కొనసాగారు. బదిలీల్లో అధికారులు ఇతర ప్రాంతాలకు కాగా కిందిస్థాయిలో ఇప్పటికి కొనసాగుతున్నారు. ఏసీబీ దాడులతో ఉన్నతాధికారి దొరకడంతో అధికారుల మార్పు కూడా ఉంటుందని భావిస్తున్నారు. నేతలకు దగ్గరగా ఉండి పనులు చక్కబెట్టే వారిని గుర్తించి బదిలీ చేయనున్నట్లు తెలుస్తుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఇతర ప్రాంతాలకు పంపించనున్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. ఏసీబీ దాడులు జరగడంతో కొంతమంది డిప్యూటేషన్‌పై ఇతర మున్సిపాలిటీలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కోటగిరిలో 8 కొత్త పంచాయతీల ఏర్పాటు

కోటగిరి, ఆగస్టు10: కోటగిరి ఉమ్మడి మండలంలో 8 కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 8 పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కోటగిరిలోని ఎక్లాస్‌పూర్ గ్రామం నుంచి ఎక్లాస్‌పూర్ క్యాంప్, ఎత్తొండ గ్రామం నుంచి ఎత్తొండ క్యాంప్, లింగాపూర్ నుంచి శ్రీనివాస్ రెడ్డికాలనీ, హెగ్డోలి నుంచి బకార్‌ఫారం, జల్లాపల్లి ఆబాది నుంచి జల్లాపల్లిపాత గ్రామం, జల్లాపల్లి ఫారం నుంచి జల్లాపల్లి తండా, పొతంగల్ నుంచి తిర్మలాపూర్, సోంపూర్ నుంచి రాంగంగానగర్ గ్రామాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీపీల ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

అవినీతికి అడ్డాగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

• అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, ఆగస్టు10: నిజామాబాద్ మున్సిపాలిటీ అవినీతికి అడ్డాగా మారిందని, తాను గెలిచినప్పటి నుంచి ఇదే విషయంపై పలుమార్లు హెచ్చరించానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుర్తుచేశారు. మున్సిపల్ అధికారిపై జరిగిన ఏసీబీ దాడులపై ఎమ్మెల్యే ఆయన స్పందిస్తూ శనివారం మాట్లాడారు. ఏసీబీ దాడుల్లో ఓ అధికారి ఇంట్లో రూ. 6 కోట్లకు పైగా నగదు, పెద్దమొత్తంలో బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తుల దస్తవేజులు దొరకడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. మున్సిపల్, వివిధ శాఖల్లో అవినీతి తిమింగలాలు ఇంకా ఉన్నాయని, మున్సిపల్ అవినీతి ప్రక్షాళన ఇంకా జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. అవినీతిపరులైన అధికారులు ఉన్నంతకాలం సామాన్యులకు ప్రభుత్వ



సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మిగిలిపోతాయని మున్సిపల్ కమీషనర్, జిల్లా కలెక్టర్ కిందిస్థాయి అధికారులపై, శాఖలపై ఎప్పటికప్పుడు న్యాయ సమీక్ష నిర్వహించి ప్రజలకు న్యాయబద్ధమైన పాలన అందించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి దోచుకున్న ప్రతీపైసా నగర అభివృద్ధికే ఖర్చు పెట్టాలని, ఏసీబీ అధికారులు రికవరీ చేసిన అక్రమ ఆస్తులు తిరిగి మున్సిపల్ ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాపై సీజనల్ వ్యాధుల పంజా!



• జిల్లావ్యాప్తంగా ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు • జ్వరం, దగ్గు, విరోచనాలు, టైఫాయిడ్‌తో ప్రతీ ఇంటా రోగులు
• పెరిగిన డెంగ్యూ కేసులు • కొనసాగుతున్న ఇంటింటి జ్వర సర్వే • ఇప్పటివరకు 2లక్షల 62వేల ఇళ్లల్లో పూర్తి
• 6.22 లక్షల రక్త నమూనాల సేకరణ • జిల్లాలో 3,885 మందికి జ్వరాలు వచ్చినట్లు గుర్తింపు
• డెంగ్యూ పేరుతో ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ

నిజామాబాద్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాపై సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. డెంగ్యూ కేసులతోపాటు టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయి. వర్షంనీరు ఎక్కడికక్కడ నిలిచిఉండటంతో దోమలు వృద్ధిచెంది విజృంభిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యసర్వేలు నిర్వహిస్తుండగా ప్రతీఇంటా జ్వర బాధితులు బయటపడుతున్నారు. కేసులు ఎక్కువ అవుతుండటంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేకవార్డును వ్యాధుల కోసం ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నారు. డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉన్న గ్రామాల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. రోగులకు చికిత్సతోపాటు మందులను అందిస్తున్నారు. సీరియస్‌గా ఉన్న రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తున్నారు. జిల్లాలో వ్యాధుల తీవ్రత పెరుగుతుండగా ప్రైవేటు ఆసుపత్రుల్లోకి వచ్చేవారికి డెంగ్యూ పేరుపై వివిధ పరీక్షలను నిర్వహిస్తున్నారు. జ్వరతీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని చెబుతూ చికిత్స కోసం చేర్చుకుంటున్నారు. పెద్దఎత్తున ఫీజులను వసూలు చేస్తున్నారు.

• రోగులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు

జిల్లాలో గడిచిన నెలరోజులుగా వ్యాధుల తీవ్రత భారీగా పెరిగింది. డెంగ్యూకేసులు జిల్లాలో భారీగా పెరుగుతున్నాయి. సాధారణ జ్వరాలతోపాటు టైఫాయిడ్ ఎక్కువగా వస్తున్నాయి. దగ్గు, జలుబు, విరోచనాలతో ఎక్కువ మంది ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువగా జ్వరాలతో బాధపడేవారు వైద్యులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. సీరియస్‌గా ఉన్న వారు ఆ సుపత్రులలో చేరి చికిత్స పొందుతున్నారు. కొన్నిరోజులుగా జిల్లాలోని అన్నిఆసుపత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులనే తేడాలేకుండా ఎక్కువగా రోగులు వస్తున్నారు. డెంగ్యూకేసులు ఎక్కువగా రావడంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేకవార్డును ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

• కొనసాగుతున్న ఇంటింటి సర్వే..

జిల్లాలో గత పది రోజులుగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేను చేపడుతోంది. ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, వ్యాధులతో బాధపడే వారి వివరాలను సేకరిస్తున్నారు. జ్వరం వచ్చిన వారికి సత్వర చికిత్స అందించడంతోపాటు వారికి కావాల్సిన మందులను అందిస్తున్నారు. వారి రక్త నమూనాలను కూడా తీసుకుంటున్నారు. వారికి వచ్చిన వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. జ్వరాలు వచ్చిన రోగులకు కూడా సమాచారాన్ని పంపిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2లక్షల 60వేల ఇళ్లకు పైగా ఇంటింటి సర్వేను వైద్యఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఈ ఇళ్లల్లో జ్వరాలు వచ్చినవారి నుంచి 6.22లక్షల రక్తనమూనాలను సేకరించారు. ఈ రక్తనమూనాలను పరిశీలించి ఇప్పటివరకు జిల్లాలో 3885 మందికి జ్వరాలతోపాటు ఇతర వ్యాధులు వచ్చినట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొంత మందికి చికిత్స ద్వారా నయమైనట్లు ప్రకటించారు. జిల్లాలో సాధారణ జ్వరాలతోపాటు దోమలు కుట్టడంతో టైఫాయిడ్ ఎక్కువగా వస్తున్నట్లు సర్వేలో గుర్తించారు. వీటితో పాటు జలుబు, దగ్గు, విరోచనాలతో బాధపడే వారు కూడా ఎక్కువగా ఉండటంతో వారికి చికిత్స పీహెచ్‌సీల వారిగా అందిస్తున్నారు. సీరియస్‌గా ఇబ్బందులు పడుతున్న రోగులను గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలిస్తున్నారు.

• మోస్రాలో 34 డెంగ్యూ కేసులు

జిల్లాలో డెంగ్యూ కేసులు భారీగా పెరిగాయి. జిల్లావ్యాప్తంగా పలు మండలాల పరిధిలో ఇప్పటివరకు 222 డెంగ్యూకేసులు నమోదు అయ్యాయి. అత్యధికంగా మోస్రాలో 34 డెంగ్యూ కేసులు రావడంతో ప్రత్యేక చర్యలను చేపట్టారు. మోపాల్ మండలం ముదక్‌పల్లి, ఇందల్వాయి, సిరికొండ, అర్సపల్లి పీహెచ్‌సీల పరిధిలో ఒక్కో పీహెచ్‌సీలో 20కి పైగా కేసులు బయటపడటంతో ఈ ప్రాంతాలను హైరిస్క్ జోన్‌లుగా ప్రకటించి సర్వేలు కొనసాగిస్తున్నారు.

• డెంగ్యూ పేరుతో ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ

డెంగ్యూకేసులు పెరుగుతుండడాన్ని ఆసరా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నారు. భారీఎత్తున ఫీజులను వసూలు చేస్తున్నారు. జ్వర తీవ్రతతో బాధపడుతూ వచ్చే రోగులకు పలు టెస్టులను నిర్వహిస్తున్నారు. రక్తపరీక్షల ద్వారా జ్వరతీవ్రత ఎక్కువగా ఉన్నదని చెబుతున్నారు. కొంతమందికి ప్లేట్‌లెస్ బాగా తగ్గాయని, డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని వారిని ఆసుపత్రిలో చేర్చుకుంటున్నారు. నాలుగైదు రోజులు ఉంచుకొని ఎక్కువ మొత్తంలో ఫీజులను వసూలుచేస్తున్నారు. ఆయా రోగాలకు ఎంతఫీజులు వసూలు చేస్తున్నారో నోటీసుబోర్డులో పేర్కొనాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ల్యాబ్‌లతో సంబంధాలున్న కొన్నిప్రైవేటు ఆసుపత్రులు ఎక్కువగా ఈ కేసులను నమోదు చేస్తున్నారు. డెంగ్యూకు ఎలీసా టెస్టు చేసి ప్రకటించాల్సి ఉన్నా ల్యాబ్‌ల ద్వారా ప్రత్యేక కిట్‌ల పేరుపెట్టి ప్రకటిస్తున్నారు. రోగులను ఆసుపత్రుల్లో చేర్చుకుంటున్నారు. కొంతమందికి మందులతో తగ్గే అవకాశం ఉన్నా వారిని కూడా చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు. ప్యాకేజీల పేరుపై గ్రామాల నుంచి రోగులు వచ్చేలా చూసుకొని చికిత్స ప్రైవేటు ఆసుపత్రుల్లో కొనసాగిస్తున్నారు. కొంతమంది వైద్యఆరోగ్యశాఖ అధికారులకు ఈ ఫిర్యాదులను చేస్తున్నా వీటిపై దృష్టిపెట్టడం లేదు. గతంలో ఫిర్యాదులు వచ్చిన వాటిపై కలెక్టర్ స్పందించి ఆ ఆసుపత్రులపై సర్వే చేయించి నోటీసులను కూడా ఇచ్చారు. అయినా ఫలితం లేదు. రోగాలను గుర్తించి చికిత్స అందించడం మొదలు మందుల వినియోగంవరకు అంతా ఒక ప్యాకేజీగా కొనసాగిస్తున్నారు.

• ప్రజలు శుభ్రతను పాటించి జాగ్రత్తగా ఉండాలి

జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలు శుభ్రతను పాటించి జాగ్రత్తగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ రాజశ్రీ తెలిపారు. జిల్లావ్యాప్తంగా సర్వే చేస్తున్నామని ఆమె వివరించారు. జ్వరం వచ్చిన వారిని గుర్తించి పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. డెంగ్యూ కేసులు పెరగడంతో వారిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వ్యాధులు రాకుండా గ్రామస్థాయిలో పీహెచ్‌సీల వారిగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

హన్మాన్ చాలీసా పారాయణం

డొంకేశ్వర్, ఆగస్టు 10 : సమాజంలో ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని కేదారేశ్వర్ ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా శనివారం ఉదయం డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో హన్మాన్ ఆలయంలో గ్రామస్థులు నిర్వహించిన హన్మాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. ప్రతీఒక్కరు భక్తి భావనతో నడుచుకొని భక్తితో ఉంటే మంచి పనులు చేయాలని ఆలోచనలు వస్తాయని తెలిపారు. హన్మాన్ చాలీసా యొక్క విశిష్ఠతను ప్రజలకు ఆయన వివరించారు. ప్రతీ శనివారం హన్మాన్ ఆలయంలో హన్మాన్ చాలీసా పారా యణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్తా శ్రమ వ్యవస్థాపకుడు ఎనుగంటి నారాయణస్వామి, బీజేపీ సీనియర్ నాయ కులు మారంపల్లి గంగాధర్, లక్ష్మీనారాయణ, బాపురావు, సంతోష్, భూపతి, భోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఆగస్టు 10 : ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గల నర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో ప్రతీ శనివారం ఉదయం, సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.

జంబి హనుమాన్ ఆలయంలో అన్నదానం

అర్మూర్‌టౌన్, ఆగస్టు 10 : పట్టణంలోని జంబిహన్మాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతగా పస్‌గంటి లక్ష్మంబా సత్యనారాయణలు వ్యవహరించగా జంబిహన్మాన్ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జంబి హన్మాన్ ఆలయ కమిటీ ఛైర్మన్ గోర్త దేవేందర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు10: బోధన్ పట్టణంలోని ఆటోనగర్, కొత్తబస్టాండ్, శివాలయం, హనుమాన్ మందిరం తదితర ప్రాంతాలలో శనివారం నిరుపేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ స్వగ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేసినట్లు బండారి సాయిచరణ్, శ్రావణిలు తెలిపారు. సామాజిక సేవకులు అశోక్‌కుమార్ రోడే, రమేష్ పోశెట్టి పాల్గొన్నారు.

నేడు ఐడీసీఎంఎస్ ఛైర్మన్‌కు సన్మానం

డిచ్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని రాంపూర్ రైతువేదికలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాంపూర్ విండో ఛైర్మన్‌గా కొనసాగుతున్న బాదవత్ తారాచంద్ నాయక్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నటు విండో కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆయా గ్రామాల మాజీసర్పంచ్‌లు, మాజీ ఎంపీ టీసీలు, విండో డైరెక్టర్‌లు, పాల్గొంటారని, సన్మాన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విండో రైతులు, డైరెక్టర్‌లు హాజరుకావాలని విండో కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

శెట్‌పల్లిలో రైతులకు వాటర్‌ఫిల్టర్ల పంపిణీ



వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న అధికారులు

మోర్తాడ్, ఆగస్టు 10 : మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో నలుగురు రైతులకు క్యారీఫై వాటర్‌ఫిల్టర్‌లను పంపిణీ చేశారు. గత ఏడాది సజ్జ, మొక్కజొన్న దిగుబడిలో సజ్జ, మొక్కజొన్న పంటలు అధికంగా దిగుబడులు సాధించిన రైతులకు ప్రైవేటు సీడ్‌సంస్థ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, జగన్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, నర్సారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ర్యాడే మోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కోనాపూర్ రహదారి



అధ్వానంగా మారిన కోనాపూర్ ప్రధాన రహదారి



బురదమయమైన రోడ్డు

- చిరుజల్లుకు చిత్తడి.. చిత్తడి..
- బురదలో కూరుకుపోతున్నవాహనాలు
- ఇబ్బందులు పడుతున్నగ్రామస్తులు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని కోనాపూర్ ప్రధాన రహదారి చిరుజల్లుకే చిత్తడిగా మారి ప్రయాణం సాహసోపేతంగా మారింది. గ్రామస్తులు పొరుగు గ్రామాలు (జగిత్యాల జిల్లా) కోరుట్ల, ఖతలాపూర్, భూషన్‌రావుపేట్‌కు వెళ్లాలన్నా చివరకు తమ పంట పొలాలకు వెళ్లాలన్న ఈ రహదారిపై సాహసోపేత ప్రయాణాలు తప్పడం లేదు. మండలంలోని నర్సాపూర్ గ్రామం నుంచి వయా ఇనాయత్‌నగర్, కోనాపూర్ గ్రామం వరకు బీటీరోడ్డు రెన్యూవల్ నిమిత్తం నాన్‌ప్లానింగ్ పథకంలో రూ.3 కోట్ల 16 లక్షలు, నర్సాపూర్ గ్రామం నుంచి వయా ఇనాయత్‌నగర్, కోనాపూర్ గ్రామం మీదుగా జగిత్యాల జిల్లా భూషన్‌రావుపేట్ గ్రామం వరకు డబుల్ రోడ్డు నిమిత్తం ఎస్సీ ఎస్డీఎఫ్ నిధుల నుంచి 65 కోట్ల 20 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులకు 13 జూలై 2023లో శంకుస్థాపన చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ గ్రామానికి రెండు వైపుల రోడ్లను చదునుచేసి మధ్యలో కంకరపోసి వదిలేశాడు. బీటీ నిర్మాణ పనులకు కొంత జాప్యం అయింది. మరోవైపు అదే సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు మరుగునపడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

● డీఎంహెచ్‌వో రాజశ్రీ



వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో

డిచ్‌పల్లి, ఆగస్టు 10 : ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. శనివారం డిచ్‌పల్లి ముప్పైపడకల ఆస్పత్రిని ఆమె సందర్శించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఆరోగ్యమేళా కార్యక్రమానికి స్త్రీవైద్య నిపుణురాలు సుశ్మ, దంత వైద్యనిపుణులు సరిత గ్రేస్ హాజరై రోగులకు మంచి సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే గైనకాలజీ సమస్యలపై స్కానింగ్ చేసి చికిత్స అందించాలని రాజశ్రీ పిలుపునిచ్చారు. ఆరోగ్యమేళాలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగరాజు, వేణు గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం



మొక్కలు నాటుతున్న కాలనీకమిటీ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 10 : పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛదనం - పచ్చదనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యుల సహకారంతో వివిధ రోడ్లలో మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సంబంధిత ఇంటి యజమానులకు సూచించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు సుంకెశ్రీనివాస్, పుప్పాల శివరాజ్, కమలాకర్, సత్యనారాయణగౌడ్; కొక్కెర భూమన్న, సాయన్న, కొంతం రాజు, గడ్డం శంకర్, గణేష్, ఖదీర్, పారిశుధ్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 10 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకికొండ చుట్టు ప్రదక్షిణ చేయించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి

జక్రాన్‌పల్లి, ఆగస్టు 10 : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న అర్గుల్ గ్రామానికి చెందిన రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అర్గుల్ గ్రామంలో రైతు కుంట రాజేష్ కుటుంబాన్ని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాంలు కలిసి పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రైతు కుంట రాజేష్ భూమి ధరణిలో నమోదు కాకపోవడం, చేసిన అప్పులు తీర్చలేక రైతు కుంట రాజేష్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ధరణిలో రైతుల భూములు నమోదు కాకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నారన్నారు. అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి రైతు కుంట రాజేష్‌ను ఇబ్బందులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధానకార్యదర్శి బి.దేవరాం, జిల్లా అధ్యక్షుడు సూర్య సురేష్, నాయకులు బాబన్న, తలారి గంగారాం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సం ఘం రాష్ట్ర నాయకుడు గంగాధర్, దేవన్న, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

బోధన్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

బోధన్ రూరల్, ఆగస్టు 10 : బోధన్ పట్టణంతో పాటు ఎడపల్లి, బోధన్, ఇతర మండలాల్లో ఉన్న సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బెనర్జీ తెలిపారు. ప్రతి నెల రెండో శనివారం సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం విద్యుత్ అందించాలన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్య ఎదురైతే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. రైతులు, ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

పంచాయతీ రాజ్ కార్యాలయానికి కోటగిరి ఎంపీడీవో అటాచ్

కోటగిరి, ఆగస్టు 10 : కోటగిరి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎంపీడీవో మనోహర్‌రెడ్డిని పంచాయతీ రాజ్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అనారోగ్య కారణాలతో ఎంపీడీవో సెలవులో వెళ్తున్నట్లు అధికారులు ప్రకటించినా ఆయన బదిలీ వెనుక రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు తెలిసింది. ఏడాదిన్నర క్రితం కోటగిరి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ రెడ్డి మండలంలో అన్ని రాజకీయాలను కలుపుకుని అభివృద్ధికి కృషిచేశారు. ఇటీవల మండలంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో ఎంపీడీవో బదిలీకి ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. ఓ నాయకుడికి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన బదిలీకి ప్రయత్నించారని మండలంలో చర్చ జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం కోటగిరి ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న చందర్‌కు కోటగిరి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యం

వేల్పూర్, ఆగస్టు 10 : వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి వలస వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్టు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన జైపాల్ హన్మంత్‌రావు తన భార్య ఆశరాణితో కలిసి వచ్చి జాన్కంపేట్ గ్రామానికి నెల రోజుల క్రితం వలస వచ్చి కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో భార్యతో గొడవపడిన హన్మంతురావు భార్యకు చెప్పకుండా వెళ్ళిపోయాడు. వారి బంధువుల ఇళ్ళలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని, భార్య ఆశరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. హన్మంతురావు ఇంట్లో నుంచి వెళ్ళినప్పుడు ఎర్రచొక్క, జీన్స్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ దొరికనట్లైతే 8712659862 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బోధన్‌లో ఎస్‌ఐల బదిలీలు

బోధన్‌రూరల్, ఆగస్టు 10 : బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఐ నాగనాథ్ వేల్పూర్‌కు బదిలీ అయ్యారు. కమ్మర్‌పల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ బోధన్ రూరల్ ఎస్ఐగా బదిలీపై రానున్నారు. అలాగే బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామారావు బదిలీపై ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లారు. బోధన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మచ్చేందర్ రెడ్డితో పాటు మరో ఎస్ఐ త్వరలో విధుల్లో హాజరుకానున్నారని ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసు శాఖలో బదిలీలు సహజమేనని ఎక్కడ ఉన్న మంచి నిబద్ధతతో పని చేసి పేరు సంపాదించుకోవాలన్నారు. శాంతిభద్రత పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

'కుక్కల బెడదను తీర్చండి'



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు

బోధన్‌రూరల్, ఆగస్టు 10 : బోధన్ పట్టణంలో రోజురోజుకు కుక్కల బెడద అధికం అవుతుందని, కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేట్టాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణంలో కుక్కలు విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తూ అందరిని కరుస్తున్నాయని, బోధన్ మున్సిపల్ యంత్రాంగం కనీసం గాయాలపాలైన వారిని పరామర్శించకపోవడం, చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వర్షాకాలంలో రోడ్లు పాడై గుంతలు పడుతున్నా గుంతలు పూడ్చడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందని ఆరోపించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మున్సిపల్ యంత్రాంగంతో రివ్యూ మీటింగ్ నిర్వహించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాం, కౌన్సిలర్ సత్యం, సీనియర్ నాయకులు మహ్మద్ రజాక్, కార్మిక విభాగం అధ్యక్షులు రవి శంకర్ గౌడ్, ప్రవీణ్ నాయక్, హైమద్, సాగర్, షేక్.జాకీర్ ఉన్నారు.

టీడీపీ నాయకుడిని కలిసిన జనసేన



తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిని కలిసిన జనసేన నాయకులు

బోధన్ రూరల్, ఆగస్టు 10 : తెలుగుదేశం నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్ రావును శనివారం బోధన్ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ శివ, జనరల్ సెక్రెటరీ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు హన్మంత్‌రావుతో కలిసి రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగరాజు, షేక్.మహ్మద్, గణేష్‌గౌడ్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై జ్వర సర్వే



బాల్కొండలో నిల్వ ఉన్న నీటిలో దోమల మందు పిచికారి చేస్తున్న వైద్యసిబ్బంది

ముప్కాల్, ఆగస్టు 10 : బాల్కొండ మండలంలోని పోచమ్మగల్లీలో శనివారం వైద్య సిబ్బంది జ్వరసర్వే నిర్వహించారు. అనంతరం పోచమ్మగల్లీలో దోమల మందు పిచికారి చేశారు. అపరిశుభ్రంగా ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందినా రోగాలు బారినపడే అవకాశం ఉందని, ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మరియమ్మ, ఆశవర్కర్‌లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్‌మేళా



ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్‌మేళాలో చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మోర్తాడ్, ఆగస్టు 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వ హెల్త్‌కమ్యూనిటీ సెంటర్‌లో జిల్లా వైద్యాధికారులు హెల్త్‌మేళా నిర్వహించారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం హెల్త్‌మేళా నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులు, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యుడు డాక్టర్ రాజేష్, డాక్టర్ ప్రవీన్‌కుమార్, డాక్టర్ జోత్స్న, ఫార్మాసిస్టు సంజీవ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

పెద్దబజార్, ఆగస్టు 10: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శనివారం బీజేపీ ఓబీసీ స్వామియాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. బండి సంజయ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని కష్టపడ్డ కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన సాగర్

మోపాల్, ఆగస్టు 10: చెరువులో దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని న్యాల్‌కల్‌లో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన తెడ్డు సాగర్‌కు నవీపేటకు చెందిన చందనతో సంవత్సరం క్రితం వివాహమైంది. ఆర్థిక సమస్యలతో ఇద్దరికీ గొడవలు తలెత్తాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇద్దరు పనికి బైక్‌పై వెళ్తుండగా మార్గంమధ్యలో ఇద్దరు గొడవపడ్డారు. ఆవేషానికి గురైన తెడ్డు సాగర్ (26) న్యాల్‌కల్ చెరువులో దూకాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గజ ఈతగాళ్లను ఎంత గా లించినా దొరకకపోవడంతో గంట సమయం తర్వాత శవమైతేలినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమి త్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఇందూరు తిరుమలకు గోవుల అందజేత

మోపాల్, ఆగస్టు 10: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రముఖ సినీ గేయరచయిత శ్రీరామ జోగయ్యశాస్త్రి గోవులను గోవింద వనమాల క్షేత్రానికి ఇచ్చారు. శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇందూరు తిరుమలలో ఉన్న గోవింద వనమాల క్షేత్రానికి రెండు ఆవులను బహూకరించారు. ఆయన వెంట ఇందూరు తిరుమల ఆలయ ట్రస్ట్ ప్రతినిధి నర్సింహారెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి కులస్తులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రెడ్డి కులస్తులు

మోపాల్, ఆగస్టు 10: మండలంలోని రాణాకుర్దు రెడ్డి సంఘానికి, గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న రాణాకుర్దు గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని వివరించారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా ఉందని రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. రెడ్డి సంఘానికి కూడా నిధులు మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యారెడ్డి, మాజీ సర్పంచులు అనంత్‌రెడ్డి, రాజారెడ్డి, అంగలి సాయిరెడ్డి, మహేందర్‌రెడ్డి, అంగలి సూర్యా రెడ్డి, విజయ్, లింబారెడ్డి, ప్రశాంత్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంపై వ్యాసరచన పోటీలు

బాన్సువాడటౌన్, ఆగస్టు10: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో శనివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛత, పచ్చదనంతో కలిగే లాభాలపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బాల్యం నుంచే విద్యార్థులు స్వచ్ఛత, శుభ్రత అంశాలపై పట్టు సాధించాలని, ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛతతో ఎలాంటి రోగాలు కూడా దరిచేరవన్నారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి

మాచారెడ్డి, ఆగస్టు 10: మాచారెడ్డి మండలంలోని చుక్కపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. పుట్టువెంట్రుకలు, వాహనపూజలు, సహస్రనామార్చన, ఒడిబియ్యాలు, గండదీపాలు నిర్వహించి భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమాలకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులూ.. తస్మాత్ జాగ్రత్త!

- ఆగస్టు 16 నుంచి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తున్న పోలీసు శాఖ
- నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలే..
- ప్రమాదాల నివారణకే కఠిన చర్యలు: ట్రాఫిక్ ఏసీపీ నారాయణ



నిబంధనలు పాటించని వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు (ఫైల్)

ఖిల్లా, ఆగస్టు 10: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాల్సిందేనని పోలీసులు శాఖ విజ్ఞప్తి చేస్తోంది. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే భారీగా జరిమానాలు విధించడానికి సిద్ధమవుతోంది. వాహనదానులు ఈనెల 16 నుంచి హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఇప్పటికే ప్రచారం చేసింది. ఖచ్చితంగా అమలు చేయడానికి పోలీసు శాఖ కసరత్తు మొదలుపెట్టింది. అందుకు సంబంధించిన ఫ్లెక్సీలను నగరంలో ఏర్పాటుచేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుంది. రాష్ట్రపోలీసు శాఖ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదంలో మరణాలను తగ్గించేందుకు వాహనదారులకు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని సూచించింది. హెల్మెట్ వాడకంపై ఇప్పటికే పోలీసుశాఖ, న్యాయశాఖలు సంయుక్తంగా అవగాహన సదస్సులను నిర్వహించింది. హెల్మెట్ ధరించక పోవడంతో కలిగే అనర్థాలను వివరించింది. నగరంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపడం, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, ఇన్సూరెన్స్, డ్రవింగ్ లైసెన్సులు లేకుండా వాహనం నడుపడం, మద్యం సేవించి వాహనం నడుపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, సిగ్నల్స్ జంప్ చేయడంలాంటి వాటిపై గత కొన్ని రోజులుగా తనిఖీలను ముమ్మరం చే స్తూ భారిగా జరిమానాలను విధిస్తుంది. ప్రజల్లో మార్పును తీసుకరావడానికి పోలీసు శాఖ ట్రాఫిక్ విభాగం సిబ్బంది ఏసీపీ నారాయణ నేతృత్వంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ వాహనాల తనిఖీని కొనసాగిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో నిబంధనలను ఉల్లంఘించడంతో రోడ్డు ప్రమాదాల ఘటనలు పెరుగుతున్నాయని పోలీసుశాఖ భావిస్తోంది. అందులోభాగంగానే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటుంది.

రోడ్డు ప్రమాదాల నివారణకే..

● నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ



రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కొన్ని కఠిన నిబంధనలను అమలు చేస్తున్నాం. 16వ తేదీ నుంచి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి. ఇప్పటికే రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపడం, లైసెన్సులు లేకుండా వాహనం నడుపడం, మైనర్లకు వాహనం నిషేధించాలని సూచిస్తున్నాం. ప్రజల్లో మార్పును తీసుకవచ్చి ప్రమాదంలో ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవడానికే పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేస్తున్నాం. వాహనాల తనిఖీలు ప్రతీరోజు కొనసాగిస్తాం.

సమానత్వం కోసం పోరాడాలి



సభలో మాట్లాడుతున్న ఝాన్సీ

పెద్దబజార్, ఆగస్టు10: అన్ని రంగాల్లో మహిళల సమానత్వం కోసం బలమైన పోరాటాలు నిర్మించి పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ద్వారకనగర్‌లోగల ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీవోడబ్ల్యు జిల్లా ఏడవ మహాసభ నిర్వహించారు. అంతకుముందు పివోడబ్ల్యు జెండాను జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ సమాజంలో మహిళల పోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువచ్చాయని నేడు ప్రభుత్వాలు మహిళా చట్టాలను అమలు చేయడం లేదని అన్నారు. కొట్లాది సాధించుకున్న హక్కులను ప్రభుత్వం వెనక్కి తీసుకుపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరిత మాట్లాడుతూ ఆటవిక యుగం నుంచి సమాజ పరిణామ క్రమంలో అభివృద్ధిలో మహిళా పాత్ర కీలకమన్నారు. నేటి మహిళలు ప్రాధాన్యత ఉంటే మహిళా పథకాలు మహిళల చుట్టూ రాజకీయాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆకుల పాపయ్య, నీలం లక్ష్మి, సంజన, అరుణ, లక్ష్మి, భారతి, రాధా, పుష్పలత, అనురాధా, శైలజా తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్‌ను కలిసిన ధర్పల్లి బీఆర్ఎస్ నాయకులు

ధర్పల్లి, ఆగస్టు 10: ధర్పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిశారు. హైదరాబాద్‌లోగల కెటిఆర్ నివాసంలో కలిసిన నాయకులు కెటిఆర్‌ను శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో బిఆర్ఎస్ పార్టీ గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి కృషి చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మజీద్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర ఉద్యమంలో లాల్‌బహదూర్ శాస్త్రిది కీలకపాత్ర



విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఆగస్టు 10: స్వాతంత్ర ఉద్యమంలో లాల్‌బహదూర్ శాస్త్రి కీలకపాత్ర పోషించారని బీజేపీ కంఠేశ్వర్ మండలం అధ్యక్షుడు రోషన్‌లాల్ బోరా అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ అభినయంలో భాగంగా సమరయోధుడు లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహాల శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాబోయే తరాలకు వారు చేసిన త్యాగాలను అందే విధంగా ప్రతీ పౌరుడికి ఈ దేశంపైన భక్తి, బాధ్యత, గౌరవం పెరగాలని అన్నారు. కుల మతాలకు చిన్నా పెద్ద కుటుంబాలకు దళిత పేదతేడా లేకుండా ఈనెల 15న ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు. సహాయ నిరంకారణ ఉప్పు సత్య గ్రహ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని సుమారు ఎనిమిది సంవత్సరాలు జైల్లో ఉన్నారని అన్నారు. రెండవ ప్రధానిగా సేవలు అందించారని అన్నారు. ఇండో - పాకిస్తాన్ యుద్ధం ఒప్పంద సమయంలో ఆయన అకస్మాత్తుగా మరణించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, శ్రీనివాస్, వేణు, దొంతుల రవి, సాయిప్రవీణ్, సంజీవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



జెండ ఆవిష్కరణలో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఘనంగా యూటీఎఫ్ అవతరణ దినోత్సవం

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు10: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం టీస్‌యూటీఎఫ్ పతాకాన్ని జిల్లా ప్రధానకార్యదర్శి ఓ.రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్‌లు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఏర్పడిన యూటీఎఫ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వర్ణోత్సవాలు జరుపుకుంటుందని, ఉపాధ్యాయ ఉద్యమాన్ని శిఖరాగ్రామ నిలిపి ఐక్య ఉద్యమాలు నిర్మించిందని అన్నారు. తొమ్మిది మందిని ఉపాధ్యాయుల, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా గెలిపించుకొని అనేక ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. నిరంతరం విద్యారంగ బాగు కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎఫ్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎస్ హెచ్‌ఎంల పోస్టులను మంజూరుచేసి డిఈఓడి, బిఈఓడి వారితో ఉమ్మడిగా పదోన్నతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, గంగాధర్, రాజారాం, సాయన్న, భాజన్న, భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ఎల్లారెడ్డి, ఆగస్టు10: విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డిలోని లింగారెడ్డిపేట్ శివారులో శనివారం చోటుచేసుకుంది. లింగారెడ్డిపేటకు చెందిన మామిడి చిరంజీవులు (54), ఆయన భార్య శనివారం పొలానికి మందు చల్లడానికి వెళ్లారు. మందు చల్లుతుండగా దాహం వేయడంతో నీరు తాగేందుకు బోర్‌మోటార్‌ను స్టార్ట్‌చేశాడు. అది పనిచేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ జంపర్‌కొట్టి విద్యుత్‌ను ఆఫ్‌చేస్తుండగా జంపర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్సై మహేష్ తెలిపారు.

పాలిటెక్నిక్‌లలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 10: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ 2 సీట్లు, సివిల్ ఇంజనీర్‌లో 1 సీటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కంఠేశ్వర్‌లో మిగిలిన మెకానికల్ ఇంజనీరింగ్ 14 సీట్లు, ఎంబెడెడ్ సిస్టమ్స్ 1 సీటుకు స్పాట్ అడ్మిషన్ల కొరకు అర్హులైన విద్యార్థులు ఈనలె 12వ తేదీ 12గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త, ప్రిన్సిపల్ నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న మధ్యాహ్నం 2.30లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒకసెట్ జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని పేర్కొన్నారు. సీటు పొందిన అభ్యర్థి పాలిసెట్ అర్హత ఉంటే ఫీజు రూ.5,680, అర్హతలేనట్లయితే రూ.6,180 చెల్లించాలని తెలిపారు. అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ధర్పల్లిలో ఆరోగ్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

ధర్పల్లి, ఆగస్టు 10: మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఉదయం నుంచి శిబిరానికి రోగులు బారులు తీరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 128 మంది వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్త్రీ వైద్య నిపుణులు, శస్త్రచికిత్స ప్రత్యేక వైద్యులచే ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 76మంది మహిళలకు జనరల్‌సర్జన్ సమస్యల గురించి, 52 మందికి ప్రత్యేక వైద్యులచే చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, రమ్య, నిఖిత, నర్సింగ్ ఆఫీసర్ అరుణలత, సృజన, మేరి, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ఖిల్లా, ఆగస్టు10: రైలులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్‌ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ హెచ్.సాయిరెడ్డి తెలిపారు. సెల్‌ఫోయిన విషయాన్ని బాధితులు ఫిర్యాదుచేయగా వెంటనే సీఈఐఆర్ ద్వారా గుర్తించినట్లు చెప్పారు. రైలులో ప్రయాణించడానికి టికెట్ తీసుకున్నవారి సెల్‌ఫోన్లు పోతే వెంటనే తమను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,500	రూ.66,800	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డి) (10.00,7.30)
: శివం భజే (1.00)
: కల్కి (3.45)
: మురారి (10.30)
స్క్రీన్-2 : కమిటీ కుర్రాళ్లు (1.00, 7.25, 10.40)
: రాయన్ (4.15)
స్క్రీన్-3 : కేస్ నంబర్-15 (11.30)
: పాగల్ వర్సెస్ పాగల్ (1.55)
: సింబా (4.25)
: భవనమ్ (7.10, 10.10)
స్క్రీన్-4 : కమిటీ కుర్రాళ్లు (11.40)
: సంఘర్షణ (2.55)
: లాంద్ మాఫియా (5.20)
: ఆలియా బసూ గయాబ్ హై (హిందీ) (8.10), తుఫాన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కమిటీ కుర్రాళ్లు (10.25, 4.40, 7.40, 10.40)
: కల్కి (1.25)
స్క్రీన్-2 : మురారి (10.05)
: కమిటీ కుర్రాళ్లు (1.25, 10.45)
: కల్కి (తెలుగు) (4.25, 7.40)
స్క్రీన్-3 : మురారి (12.15, 3.50, 7.15, 10.40)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
: రాయన్ (6.15, 9.15)
నటరాజ్ : భవనమ్ (11.00, 2.00, 9.00)
: మురారి (6.00)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15)
: మురారి (9.15)

- నిజామాబాద్ అర్బన్